# షాన్‌దార్ ఢిల్లీ

**ఆర్‌సీబీపై ఘన విజయం • రాహుల్ అజేయ అర్ధసెంచరీ • రాణించిన కుల్దీప్, విప్రాజ్**

**ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపుతున్నది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ఓటమన్నది ఎరుగకుండా దూసుకెళుతున్నది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)ను ఢిల్లీ చిత్తుచిత్తుగా ఓడించింది. కుల్దీప్‌యాదవ్, విప్రాజ్ నిగమ్ స్పిన్ తంత్రంతో ఆర్‌సీబీ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. సాల్ట్, డేవిడ్ మినహా అందరూ విఫలమయ్యారు. లక్ష్యఛేదనలో 30 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన ఢిల్లీని 'లోకల్‌బాయ్' కేఎల్ రాహుల్ ఒంటిచేత్తో గెలిపించాడు. కొట్టిన పిండిలాంటి చిన్నస్వామిలో రాహుల్ అజేయ అర్ధసెంచరీతో జట్టుకు భారీ విజయాన్ని కట్టబెట్టాడు.**


రాహుల్ (93*)


కుల్దీప్ (2/17)

బెంగళూరు: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అజేయ ప్రస్థానం కొనసాగుతున్నది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులకే పరిమితమైంది. ఫిల్ సాల్ట్ (17 బంతుల్లో 37, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆ జట్టును ఆదుకున్నారు. కుల్దీప్ యాదవ్ (2/17), విప్రాజ్ నిగమ్ (2/18) బెంగళూరును కట్టడి చేశారు. అనంతరం ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే తడబాటుకు లోనై వెంటవెంటనే వికెట్లు కోల్పోయినా కేఎల్ రాహుల్ ( 53 బంతుల్లో 93 నాటౌట్, 7ఫోర్లు, 6సిక్స్‌లు) రాణించడంతో లక్ష్యాన్ని 17.5 ఓవర్లలో ఛేదించింది. స్టబ్స్(38) నాటౌట్‌గా నిలిచాడు. భువనేశ్వర్(2/26)కు రెండు వికెట్లు దక్కాయి. రాహుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### ఇద్దరి మెరుపులతో..

ఆరంభంలో సాల్ట్, ఆఖర్లో డేవిడ్ మెరుపులు లేకుంటే బెంగళూరు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన వేగం చూస్తే మరో భారీ స్కోరు తప్పదేమో అనిపించింది. అక్షర్ రెండో ఓవర్లో కోహ్లీ బౌండరీతో పరుగుల వేటకు శ్రీకారం చుడితే అదే ఓవర్లో సాల్ట్.. 6, 4తో బాదుడుకు గేట్లెత్తాడు. స్టార్క్ 3వ ఓవర్ అయితే వార్ వన్ సైడే. ఆ ఓవర్లో సాల్ట్.. 6, 4, 4, 6, 4తో రెచ్చిపోవడంతో స్టార్క్‌ను ఆటాడుకున్నాడు. నోబాల్ బౌండరీతో కలుపుకుని స్టార్క్ ఓవర్లో ఏకంగా 30 పరుగులు వచ్చి చేరడంతో ఆర్‌సీబీ 3 ఓవర్లలోనే 53 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో ఇంత తక్కువ వ్యవధిలో ఫిఫ్టీ రన్స్ మార్కును అందుకోవడం బెంగళూరుకు ఇది రెండోసారి (మొదటిది 2011లో కొచ్చి టస్కర్స్‌పై). అయితే అక్షర్ 4 ఓవర్లో అనవసరపు పరుగుకు యత్నించిన సాల్ట్.. రనౌట్‌గా వెనుదిరిగాడు. అక్కడ్నుంచి ఆర్‌సీబీ గాడి తప్పింది. పడిక్కల్ (1).. ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో అక్షర్‌కు క్యాచ్ ఇవ్వగా విప్రాజ్ 7వ ఓవర్లో కోహ్లీ.. స్టార్క్ చేతికి చిక్కాడు. ఢిల్లీ స్పిన్నర్లు కుల్దీప్, విప్రాజ్.. బెంగళూరును కట్టడిచేసి కీలక వికెట్లు పడగొట్టారు. లివింగ్‌స్టన్ (4), జితేశ్ (3)తో పాటు సారథి రజత్ పటీదార్ (25) కూడా నిరాశపరిచాడు. 15వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన డేవిడ్.. తొలి 8 బంతుల్లో చేసినవి 4 పరుగులే. కానీ అక్షర్ 19వ ఓవర్లో 6, 4, 6తో రెచ్చిపోయిన అతడు.. ముకేశ్ వేసిన చివరి ఓవర్లోనూ రెండు సిక్సర్లు, ఓ బౌండరీతో 19 పరుగులు రాబట్టడంతో బెంగళూరు పోరాడగలిగే స్కోరును సాధించింది.

### క్యాపిటల్స్ తడబాటు

స్వల్ప ఛేదనలో క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే తడబాటుకు లోనైంది. వరుస ఓవర్లలో ఆ జట్టు కీలక వికెట్లను కోల్పోయి ఛేదనను పీకలమీదకు తెచ్చుకుంది. ధయాల్ రెండో ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన డుప్లెసిస్ (2) మిడాఫ్‌లో పటీదార్‌కు క్యాచ్ ఇచ్చాడు. భువనేశ్వర్ వేసిన మరుసటి ఓవర్లో జేక్ ఫ్రేసర్ (7) సైతం అతడినే అనుసరించాడు. 5వ ఓవర్లో భువీ.. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభిషేక్ పొరెల్ (7)నూ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ అక్షర్ (15) సైతం సుయాశ్ శర్మ 9వ ఓవర్లో లాంగాఫ్‌లో డేవిడ్ చేతికి చిక్కడంతో 58 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయింది.

### రాహుల్ విజృంభణ

బెంగళూరు బౌలర్లు విజృంభణతో సహచర బ్యాటర్లు పెవిలియన్‌కు చేరుతున్నా రాహుల్ మాత్రం క్రీజులో నిలబడ్డాడు. 5 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పటీదార్ క్యాచ్‌ను వదిలేయడంతో బతికిపోయిన రాహుల్.. అక్షర్, స్టబ్స్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపిస్తూ రన్‌రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డ రాహుల్.. కృనాల్ 12వ ఓవర్లో స్లాగ్ స్వీప్‌తో సిక్సర్ బాది ఇన్నింగ్స్ గేర్ మార్చాడు. లివింగ్‌స్టన్ 13వ ఓవర్లోనూ 4, 6తో రెచ్చిపోయిన అతడు.. 37 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో స్టబ్స్ కూడా చెలరేగడంతో ఆర్‌సీబీ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. మధ్యలో వర్షం వచ్చి నా..రాహుల్, స్టబ్స్ బౌండరీలు బాదడంతో మరో 13 బంతులుండగానే ఢిల్లీ గెలుపు ఖరారైంది. వీరిద్దరు కలిసి ఐదో వికెట్‌కు 111 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పడం మ్యాచ్ గతిని మార్చేసింది.

**సంక్షిప్త స్కోర్లు:**
**బెంగళూరు:** 20 ఓవర్లలో 163/7 (సాల్ట్ 37, డేవిడ్ 37, కుల్దీప్ 2/17, విప్రాజ్ 2/18)
**ఢిల్లీ:**17.5 ఓవర్లలో 169/4 (రాహుల్ 93 నాటౌట్, స్టబ్స్ 38 నాటౌట్, భువనేశ్వర్ 2/26, సుయాశ్ 1/25)

# మళ్లీ మహేంద్రుడికే చెన్నై పగ్గాలు

**గాయంతో ఐపీఎల్ నుంచి రుతురాజ్ ఔట్**



చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు ఐదు ట్రోఫీలు అందించిన దిగ్గజ సారథి మహేంద్రసింగ్ ధోనీ.. మరోసారి ఆ జట్టు నాయకుడిగా వ్యవహరించనున్నాడు. సీఎస్‌కే రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మోచేతి గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో జట్టు మేనేజ్‌మెంట్ మహేంద్రుడికే ఆ పగ్గాలు అప్పజెప్పింది. ఈ విషయాన్ని హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ధ్రువీకరించాడు. రాజస్థాన్‌తో మ్యాచ్ సందర్భంగా గైక్వాడ్ గాయపడ్డా ఆ తర్వాత రెండు మ్యాచ్‌లు ఆడాడు. కానీ శుక్రవారం సొంత మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో కీలక మ్యాచ్‌కు ముందు గైక్వాడ్.. టోర్నీ నుంచి తప్పుకున్నట్టు సీఎస్‌కే తెలిపింది. ఇక 2023లో చెన్నైకి ఐదో ఐపీఎల్ ట్రోఫీ అందించిన తర్వాత నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్న ధోనీ.. మళ్లీ కెప్టెన్‌గా ఆ జట్టును నడిపించనున్నాడు. రికార్డు స్థాయిలో సీఎస్‌కేను 235 మ్యాచ్‌లలో నడిపించిన ధోనీ.. ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌లలో నాలుగింట ఓడిన చెన్నైని ఏ మేరకు ఒడ్డుకు చేరుస్తాడనేది ఆసక్తికరం.

### గాయమా? 2022 రిపీటా?

2022లో చెన్నై రవీంద్ర జడేజాను ధోనీ వారసుడిగా నియమించినప్పటికీ జడ్డూ సైతం సీజన్ మధ్యలో గాయంతో నిష్క్రమించగా ధోనీ తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. అయితే అప్పుడు జడేజాతో చెన్నై మేనేజ్‌మెంట్‌కు పొసగలేదని అందుకే అతడిని అర్ధాంతరంగా తప్పించారని వార్తలు వినిపించాయి. ఈ సీజన్‌లో కూడా చెన్నై పరిస్థితి దాదాపు 2022 మాదిరిగానే ఉంది. మరి గైక్వాడ్ నిజంగానే గాయపడ్డాడా? లేక జడ్డూ పరిస్థితే రిపీట్ అయిందా? అని క్రికెట్ అభిమానులు గుసగుసలాడుకుంటున్నారు.

# క్వార్టర్స్‌కు ధ్రువ్-క్రాస్టో జోడీ

**రెండో రౌండ్ దాటని సింధు, రజావత్**



సింగిల్స్ విభాగాల్లో ముగిసిన భారత్ పోరు

నింగ్బో: చైనాలో జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. కానీ సింగిల్స్ విభాగాల్లో భారత్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. స్టార్ షట్లర్లు పీవీ సింధు, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి.. ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు. గురువారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో ధ్రువ్-క్రాస్టో జోడీ 12-21, 21-16, 21-18 యి హంగ్ వీ-నికోల్ గొంజాలెస్ (చైనీస్ తైపీ)పై పోరాడి గెలిచింది. కానీ మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు 12-21, 21-16, 16-21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ జపాన్ అమ్మాయి యమగూచి చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో రజావత్ 14-21, 17-21తో కొడాయ్ నరకొర (జపాన్)కు తలవంచక తప్పలేదు. మరో పోరులో జార్జి.. 21-19, 13-21, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావత్ వితిద్సరన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు. ఈ టోర్నీలో ధ్రువ్-క్రాస్టో మినహా మిగిలి భారత్ షట్లర్లు రెండో రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.

# బోపన్న జోడీ ముందంజ

పారిస్: మాంటె-కార్లో మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు రోహన్ బోపన్న, బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల డబుల్స్‌లో ఈ ఇండో-యూఎస్ ద్వయం 2-6, 7-6 (7/4), 10-7తో బొలెల్లి-వవస్సురి (ఇటలీ)ని ఓడించింది. మూడో సీడ్ ఇటాలియన్ జోడీ తొలి రౌండ్‌ను అలవోకగా గెలిచినా బోపన్న-షెల్టన్ ద్వయం తర్వాత అద్భుతంగా పుంజుకుని వరుస సెట్లు నెగ్గి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

# కబడ్డీ జాతీయ జట్టుకు నల్లమల ప్లేయర్



అమ్రాబాద్, ఏప్రిల్ 10: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల ప్రాంతం పదర గ్రామానికి చెందిన బండి నందిని భారత కబడ్డీ జట్టుకు ఎంపికైంది. సబ్‌జూనియర్ యూత్ ఏషియన్ కబడ్డీ టీమ్ ప్రాబబుల్స్‌లో నందిని చోటు దక్కించుకుందని జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు గురువారం పేర్కొన్నారు. జాతీయ కబడ్డీ జట్టుకు నందిని ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్

న్యూఢిల్లీ: లాస్‌ఏంజిల్స్ వేదికగా 2028లో జరుగనున్న ఒలింపిక్స్‌లో ఆరు క్రికెట్ జట్లకు అవకాశం కల్పించారు. దాదాపు 128 ఏండ్ల తర్వాత తొలిసారి విశ్వక్రీడల్లో భాగం కాబోతున్న క్రికెట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. అయితే గతానికి భిన్నంగా ఈసారి లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే ఆతిథ్య హోదాలో అమెరికా బెర్తు ఖరారు కాగా, మిగిలిన ఐదు జట్ల ఎంపికపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఐసీసీలో 12 పూర్తిస్థాయి సభ్యత్వ దేశాలు ఉండగా, 94 అసోసియేట్ దేశాలు ఉన్నాయి. ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా జట్ల ఎంపిక ఉండే అవకాశముంది. ఇదిలా ఉంటే లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్సె, స్క్వాష్ ఉన్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి టీమ్ ఈవెంట్లలో పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశం కల్పించారు.



# సురుచికి రెండో పతకం

బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): ఐఎస్ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో ఇది వరకే స్వర్ణం గెలిచిన యువ షూటర్ ఇందర్‌సింగ్ సురుచి.. గురువారం సౌరభ్ చౌదరితో కలిసి రెండో పతకాన్ని కైవసం చేసుకుంది. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భాగంగా జరిగిన కాంస్య పోరులో సురుచి, సౌరభ్ ద్వయం.. 16-8తో భారత్‌కే చెందిన మను భాకర్, రవీందర్ సింగ్ జోడీని ఓడించి కాంస్యం సొంతం చేసుకుంది. చైనాకు స్వర్ణం, రజతం దక్కాయి. ఈ టోర్నీ లో భారత్‌కు ఇది ఎనిమిదో పతకం.

# 70 కిలోల విభాగానికి లవ్లీనా!


గువాహటి: టోక్యో(2020) ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన యువ బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ తన వెయిట్ కేటగిరీ విషయంలో సందిగ్ధంలో పడింది. సాధారణంగా 75 కిలోల విభాగంలో పోటీ పడే ఆమె.. అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐవోసీ) తాజా నిబంధనలతో అయితే 70 కి. లేదా 80 కి.ల విభాగానికి మారాల్సి వచ్చింది. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్ నుంచి 75 కి. వెయిట్ క్లాస్‌ను ఐవోసీ తొలిగించడమే ఇందుకు కారణం.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| గుజరాత్ | 5 | 4 | 1 | 8 | 1.41 |
| ఢిల్లీ | 4 | 4 | 0 | 8 | 1.27 |
| బెంగళూరు | 5 | 3 | 2 | 6 | 0.53 |
| పంజాబ్ | 4 | 3 | 1 | 6 | 0.28 |
| లక్నో | 5 | 3 | 2 | 6 | 0.07 |
| కోల్‌కతా | 5 | 2 | 3 | 4 | -0.05 |
| రాజస్థాన్ | 5 | 2 | 3 | 4 | -0.73 |
| ముంబై | 5 | 1 | 4 | 2 | -0.01 |
| చెన్నై | 5 | 1 | 4 | 2 | -0.88 |
| హైదరాబాద్ | 5 | 1 | 4 | 2 | -1.62 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# రామనామ స్మరణలో..


చిత్రం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నది. త్రిష, అశికా రంగనాథ్ కథానాయికలు. జూన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. 'రామ రామ' అనే తొలి గీతాన్ని ఈ నెల 12న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో చిరంజీవి చుట్టూ హనుమంతుడి వేషధారణలో ఉన్న చిన్నారులు, వారి బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం కనిపిస్తున్నది. భక్తిరసప్రధానంగా సాగే ఈ గీతానికి ఎం.ఎం.కీరవాణి స్వరాల్ని అందించగా రామజోగయ్యశాస్త్రి రచించారు. అత్యాధునిక గ్రాఫిక్స్ హంగులతో చిరంజీవి కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, రచన-దర్శకత్వం: వశిష్ట.

# జూన్‌లో రానున్న 'కన్నప్ప'



మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఈ సినిమాలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ఈ చిత్రాన్ని జూన్ 27న విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని, ముఖ్యంగా పాటలు చక్కటి ప్రజాదరణ పొందాయని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ శివపార్వతులుగా కనిపించనున్నారు. ప్రభాస్ రుద్రుడి పాత్రను పోషిస్తున్నారు. భారీ స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని మంచు విష్ణు తెలిపారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.

# పోలీస్ స్టేషన్‌లో దెయ్యం



ఒకప్పుడు కల్ట్ మూవీస్‌తో తెలుగు, హిందీ భాషల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ గత కొంతకాలంగా రేసులో వెనకబడ్డారు. ఆయన స్థాయికి తగిన సినిమాలు రావడం లేదని అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్జీవీ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తో కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ఇందులో మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రలో నటించనున్నారు. తాను ఇప్పటివరకు హారర్, గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్, పొలిటికల్ డ్రామాస్, అడ్వెంచర్ థ్రిల్లర్స్ చేశానని, కానీ కెరీర్‌లో తొలిసారి హారర్ కామెడీ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నానని రామ్‌గోపాల్‌వర్మ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఈ సినిమాకు 'పోలీస్‌స్టేషన్ మే భూత్' అనే టైటిల్ ఖరారు చేశానని..'యూ కాంట్ కిల్ ది డెడ్' అన్నది ట్యాగ్‌లైన్ అని ఆయన తెలిపారు. 'మనకు భయమేస్తే పోలీస్‌స్టేషన్‌కు వెళ్తాం. కానీ పోలీసులే భయపడే పరిస్థితి వస్తే వాళ్లు ఎక్కడకు పోతారు?' అన్నదే ఈ సినిమా కాన్సెప్ట్. ఓ భయంకరమైన ఎన్‌కౌంటర్ తర్వాత పోలీస్‌స్టేషన్ హాంటెడ్ స్టేషన్‌గా మారుతుంది. చనిపోయిన గ్యాంగ్‌స్టర్స్ దెయ్యాలుగా మారి పోలీసులను ఇబ్బంది పెడుతుంటారు. ఇదే సినిమా కథాంశం. ఇందులో వీఎఫ్‌ఎక్స్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది' అని వర్మ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# పూరి చిత్రంలో టబు



గత కొంతకాలంగా హిందీ చిత్రసీమకే పరిమితమైంది సీనియర్ కథానాయిక టబు. సినిమాల విషయంలో సెలెక్టివ్‌గా ఉంటూ వినూత్న కథాంశాల్లో నటిస్తున్నది. 'అల వైకుంఠపురములో' తర్వాత ఆమె మరే తెలుగు సినిమాలో నటించలేదు. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత టబు తెలుగు ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇవ్వనుంది. వివరాల్లోకి వెళితే..పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ఉగాది సందర్భంగా ఈ సినిమా ప్రకటన వెలువడింది. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని జూన్‌లో సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు. ఇందులో టబు కీలక పాత్రలో నటించనున్నట్లు గురువారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. విజయ్ సేతుపతిని మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్త పంథాలో ఆవిష్కరిస్తూ దర్శకుడు పూరి జగన్నాథ్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని, ఈ కథ విన్న వెంటనే టబు సినిమాలో నటించేందుకు అంగీకరించిందని చిత్ర బృందం వెల్లడించింది. ఈ చిత్రానికి నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

# ఏది ఇష్టమో చెప్పలేను!



'తరచుగా అడిగే ప్రశ్న' ఇదేనంటూ అగ్ర కథానాయిక దీపికా పడుకోన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. అందులో తనకు ఎంతో ఇష్టమైన రెండు నగరాలు బెంగళూరు, ముంబయితో ఉన్న అనుబంధం గురించి మాట్లాడింది. బెంగళూరుకు ఎప్పుడు వచ్చినా తన సొంత ఇంటిలా ఫీలవుతానని చెప్పింది. 'నా జీవితంలో ఎక్కువ భాగం బెంగళూరులోనే గడిచింది. చదువంతా అక్కడే సాగింది. స్కూల్, కాలేజీ తాలూకు ఎన్నో జ్ఞాపకాలు ఈ నగరంతో ముడిపడి ఉన్నాయి. ఇక ముంబయి గురించి చెప్పాలంటే..వృత్తిపరంగా నాకు జీవితాన్నిచ్చింది. ముంబయి తాలూకు వైబ్స్ వేరుగా ఉంటాయి. ఈ రెండు నగరాలు నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో, విజయాల్లో కీలక భూమిక పోషించాయి. అందుకే ఏది ఇష్టమో కచ్చితంగా చెప్పలేను' అని దీపికా పడుకోన్ పేర్కొంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

# గొప్ప యుద్ధం ప్రారంభం కానుంది!



తమిళ అగ్రహీరో ధనుష్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తమిళ, తెలుగుతో పాటు హిందీలో కూడా భారీ ప్రాజెక్ట్స్ ఆయన చేతిలో ఉన్నాయి. గురువారం ఆయన 56వ చిత్రం తాలూకు ప్రకటన వెలువడింది. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. గతంలో ధనుష్-మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో 'కర్ణన్' అనే బ్లాక్‌బస్టర్ సినిమా రావడంతో తాజా ప్రాజెక్ట్ అభిమానుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా గురువారం ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీనికి 'త్వరలోనే గొప్ప యుద్ధం ప్రారంభం కానుంది' అనే క్యాప్షన్‌ను జత చేశారు. దీంతో ఈ సినిమా బ్యాక్‌డ్రాప్ ఏమైఉంటుందోనని అభిమానులు చర్చించుకుంటున్నారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఇషారి కె గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ధనుష్ కుబేర, ఇడ్లీ కడై, తేరే ఇష్క్‌మే చిత్రాల్లో నటిస్తున్నారు.

# సూపర్‌నేచురల్ 'కృష్ణలీల'



స్వీయ దర్శకత్వంలో దేవన్ హీరోగా నటిస్తున్న సూపర్‌నేచురల్ లవ్‌స్టోరీకి 'కృష్ణ లీల' అనే పేరును ఖరారు చేశారు. 'తిరిగొచ్చిన కాలం' ట్యాగ్‌లైన్. మహాసేన్ విజువల్స్ పతాకంపై జ్యోత్స్న నిర్మించారు. గురువారం ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్‌ను హీరో నిఖిల్ ఆవిష్కరించారు. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితానికి కనెక్ట్ అయ్యే అంశాలు ఈ సినిమాలో ఉంటాయని నిర్మాత పేర్కొన్నారు. కృష్ణుడి తత్వం ఆధారంగా ఈ కథను తీర్చిదిద్దామని రచయిత అనిల్ కుమార్ అన్నారు. ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్, పృథ్వీ, రవి కాలే తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కథ, సంభాషణలు: అనిల్ కిరణ్‌కుమార్, దర్శకత్వం: దేవన్.

# చందమామ కథలాంటి సినిమా



వ్యాఖ్యాత ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటించిన లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దీపిక పిల్లి కథానాయిక. డుయో నితిన్, భరత్ కలిసి దర్శకత్వం వహించారు. మాంక్స్ అండ్ మంకీస్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కింది. నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రదీప్ ఇటీవల విలేకరులతో ముచ్చటించారు. ఫ్యామిలీ అంతా కూర్చొని హాయిగా ఎంజాయ్‌చేసేలా ఈ సినిమా ఉంటుందని, ఇదో అందమైన చందమామ కథ అని ఆయన చెప్పారు. కథ గురించి మాట్లాడుతూ 'అనగనగా ఓ ఊరు. అక్కడ ఓ అమ్మాయి. అనుకోని అతిథిగా ఆ ఊర్లోకి అడుగుపెట్టిన ఓ సివిల్ ఇంజనీర్.. ఆ ఊరి కట్టుబాట్ల మధ్య ఇరుక్కుపోతాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఆసక్తికరమైన అంశం' అని తెలిపారు. ఇందులో కృష్ణ అనే పాత్ర చేస్తున్నానని, తను ఎంత చిరాకు పడతాడో ఆడియన్స్ అంత ఎంటర్‌టైన్ అవుతారని ప్రదీప్ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.